

జ్యోతిని వెలిగించి దృశ్య శ్రవణ విద్యను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు: ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.నారాయణరెడ్డి, బాపు, ముళ్ళపూడి వెంకటరమణ కూడా చిత్రంలో ఉన్నారు.



దృశ్య శ్రవణ విద్య రూపకల్పన శిల్పులు బాపు, రమణలకు ముఖ్యమంత్రి సత్కారం

# దృశ్య శ్రవణ విద్యా విధానం

# జాతికి తెలుగు సరస్వతి

# ప్రదానం

("ఆంధ్రజ్యోతి" బ్యూరో)

హైదరాబాద్, జూన్ 17: భారతీయులను బానిసలుగా మార్చి వారి దేశభక్తిని స్వాతంత్ర్య పిపాసను అణచి వేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన విద్యా విధానాన్ని మార్చి విజ్ఞానాత్మకమైన విద్యను రూపొందించక పోవడం వల్లనే దేశం ఎటువంటి పురోభివృద్ధిని సాధించ లేక పోయిందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు అన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాల స్థాయిలో ప్రవేశపెట్టనున్న దృశ్య శ్రవణ విద్యా విధానానికి బుధవారం సాయంకాలం ఆయన ప్రారంభించారు. విజ్ఞానాత్మకమైన విద్యను బోధించక పోవడం వల్లనే రక్షణాయుధాల నుండి అన్ని వస్తువులను దిగుమతి చేసు కోవలసిన దుస్థితిలో దేశం వుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయోగంతో కూడిన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టక పోవడం వలన దేశంలో నిరుద్యోగుల సంఖ్య, పేదరికం ఎక్కువవుతున్నాయని శ్రీ రామారావు చెప్పారు. కేవలం హిందీని జాతీయ భాష, ఇంగ్లీషును అంతర్జాతీయ భాషగా గుర్తించినట్లు ప్రకటించడం మినహా దేశాన్ని పాలించిన పార్టీలు విద్యా విధానాన్ని మార్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనివలన జ్ఞాన నేత్రమైన విద్య - దేశ అవసరాలకు అనుగుణంగా మారలేదని ఆయన అన్నారు. విజ్ఞానంతో కూడిన విద్యను ప్రజలకు అందించ వలసి వున్నా, ప్రభుత్వాలు తమ కనీస బాధ్యతను విస్మరించి పని చేశాయని, ఈ దృక్పథంలో మార్పులు తెచ్చి ప్రజల మద్దతుతో అధికారం లోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అంకిత భావంతో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకం కావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో దృశ్య శ్రవణ విద్యా బోధనా విధానాన్ని దేశంలో మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టేందుకు నిర్ణయించిందని శ్రీ రామారావు ప్రకటించారు.

1983లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి రాకముందు రాష్ట్రంలో అధికారం చెలాయించిన వారు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని పేరుపొందిన తెలుగు భాషను గుర్తించలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. తెలుగుజాతికి గౌరవం తెచ్చేందుకు భాషను అభివృద్ధి చేయులాని నిర్ణయించుకొన్న తెలుగుదేశం ప్రభుత్వం తెలుగు విశ్వ విద్యాలయాన్ని స్థాపించి, తెలుగును అధికార భాషగా ప్రకటించి దాని అమలుకు చర్యలు తీసుకొన్నదని ఆయన వివరించారు. తమ లక్ష్యసాధనలో భాగంగా ప్రభుత్వం దృశ్య శ్రవణ విద్యా విధానాన్ని రూపొందించిందని, ఇది తెలుగుజాతి దేశానికి ఇస్తున్న వరమని శ్రీ రామారావు ప్రకటించారు. దృశ్య శ్రవణ విద్యా విధానం విద్యార్థులలో జాతీయ వికాసాన్ని, దేశభక్తిని పెంపొందిస్తుందని దీనిని మిగిలిన రాష్ట్రాలు కూడా అనుసరించాలని ఆయన కోరారు. దృశ్య శ్రవణ విద్యా విధానం ఎవరి వద్ద అరువు ఎవరి వద్ద తీసుకొన్నది కాదని తెలుగుదేశం ప్రభుత్వం సొంత ఆలోచన అని ఆయన ప్రకటించారు.

ముందుగా ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా నల్గొండ, కృష్ణా, చిత్తూరు జిల్లాల లోని 600 పాఠశాలల్లో ఒకటి రెండు తరగతులలో అమలు చేస్తామని, తరువాత మూడు, నాలుగు, అయిదు తరగతులకు వర్తింప చేస్తామని శ్రీ రామారావు వివరించారు. ఈ విధానంలో వివిధ బోధనా పద్ధతులు వుండవని అన్ని పాఠశాలలకు ఒకే బోధనా పద్ధతి వుంటుందని ఆయన చెప్పారు. తన చలన చిత్ర రంగ అనుభవంతో దృశ్య శ్రవణ పద్ధతులు ప్రజల ఆలోచనా సరళి మీద ప్రభావం వుంటాయని గుర్తించానని, ఈ పద్ధతులను విద్యా విధానం లోకి కూడా ప్రవేశపెడితే విద్యార్థులలో విద్యపై ఉత్సాహం పెరుగుతుందనే నమ్మకంతో చలన చిత్ర రంగంలో నిపుణులైన శ్రీ బాపు శ్రీ ముళ్ళపూడి వెంకట రమణల సహాయంతో వీడియో క్యాసెట్లను రూపొందించామని శ్రీ రామారావు చెప్పారు. తాము కొన్ని విషయాలలో లోతైన సునిశిత దృష్టితో పని చేసే 'జంట కవులు' శ్రీ బాపు, శ్రీ ముళ్ళపూడి వెంకట రమణలు వీడియో క్యాసెట్లను రూపొందించడంలో కృతకృత్యులయ్యారని వీరిని తెలుగు ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని ఆయన ప్రశంసించారు. ఇంత వరకు తాను ఎవరికీ అభినందన చేయలేదని అయితే తెలుగు ప్రజల తరఫున దృశ్య శ్రవణ విద్యా విధానం సృష్టికర్తలను అభినందనం చేస్తున్నానని హర్షధ్వానాల మధ్య ఆయన ప్రకటించారు. తెలుగుజాతికి వీరిద్దరూ చేసిన సేవలకు గుర్తింపుగా వీరికి సముచితమైన బిరుదును ప్రదానం చేసి గౌరవిస్తామని ఆయన అన్నారు.

దృశ్య శ్రవణ విద్యావిధానం లో వీడియో క్యాసెట్లను రూపొందించిన శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ తన ప్రసంగంలో సినిమాలలో పని చేయడం ఒక ఎత్తని పిల్లలకి పాఠాలు